# బిఎస్ఎన్ఎల్ పరిరక్షణకు మద్దతుగా సంతకం చేయండి!

బిఎస్ఎన్ఎల్ ప్రజల సంస్థ. అది పట్టణాలలోనేగాక గ్రామీణ ప్రాంతాలలో, మారుమూల ప్రాంతాలలో కూడా ల్యాండ్‌లైన్ నెట్‌వర్క్‌ను నిర్వహిస్తున్నది. ఆ నెట్‌వర్క్ ద్వారా స్పష్టమయిన ధ్వనితో, సురక్షితముగా వుండే టెలిఫోన్ కాల్సు అందిస్తున్నది. 30.11.2014 నాటికి దేశం మొత్తముగా వైర్‌లైన్ బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్లు 1 కోటి 52 లక్షలుండగా అందులో కోటి కనెక్షన్లు బిఎస్ఎన్ఎల్ ఇచ్చినవే. భారతదేశంలో 5,93,601 గ్రామాలు ఉండగా వాటిలో 31.3.2014 నాటికి 1,69,532 గ్రామాలలో ల్యాండ్‌లైన్ ద్వారా బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్లు ఇచ్చి సమాజానికి అపూర్వమయిన సేవను బిఎస్ఎన్ఎల్ అందిస్తున్నది. అన్ని జిల్లా హెడ్ క్వార్టర్సులో, 95.65 శాతం పట్టణాలలో, 28.56 శాతం గ్రామాలలో బ్రాడ్ బ్యాండ్ కనెక్షన్లను ఇస్తున్నది. 2002లో బిఎస్ఎన్ఎల్ మొబైల్ సర్వీసులు ప్రారంభించిన తరువాత మాత్రమే మొబైల్ కాల్సు రేట్లు తగ్గాయి. ప్రకృతి వైపరీత్యాల సందర్భముగా టెలికాం సౌకర్యాలు మొదటగా పునరుద్ధరించి ప్రజలకు సేవలందించే సంస్థగా బిఎస్ఎన్ఎల్ పేరు గాంచింది. ఇటీవలి హుదూద్ తుఫాన్ సందర్భముగా టెలికాం సౌకర్యాలు అందించగలిగిన సంస్థ ఒక్క బిఎస్ఎన్ఎల్ మాత్రమే. ప్రయివేటు టెలికాం కంపెనీలన్నీ విఫలమయ్యాయి. హిడెన్ ఛార్జీలు లేకుండా నిజాయితీతో బిల్లింగు చేసే టెలికాం కంపెనీ ఒక్క బిఎస్ఎన్ఎల్ మాత్రమే. అన్ని రకాల టెలికాం సేవలను అందిస్తున్న సంస్థ బిఎస్ఎన్ఎల్ మాత్రమే.

గ్రామీణ ల్యాండ్‌లైన్ నెట్‌వర్క్ గిట్టుబాటు కాదు. అందుకనే ప్రయివేటు టెలికాం కంపెనీలు గ్రామీణ ల్యాండ్‌లైన్ నెట్‌వర్క్‌ను నిర్వహించటం లేదు. కానీ బిఎస్ఎన్ఎల్ సంవత్సరానికి రు. 10,000 కోట్లు నష్టం వచ్చినప్పటికి గ్రామీణ ల్యాండ్‌లైన్ నెట్‌వర్క్‌ను నిర్వహించి పైన తెలియజేసిన విధముగా సమాజానికి సేవలందిస్తున్నది. ల్యాండ్‌లైన్ నెట్‌వర్క్ పై వచ్చే నష్టాలకు పూర్తి పరిహారం చెల్లిస్తామని బిఎస్ఎన్ఎల్ ఏర్పడిన సందర్భముగా ప్రభుత్వం హామీ యిచ్చింది. కానీ కొద్ది సంవత్సరాలు మాత్రమే ఈ హామీని అమలుచేసి ఆ తరువాత ఆపు చేసింది. దీని వలన బిఎస్ఎన్ఎల్‌కు అనివార్యముగా నష్టాలు వస్తున్నాయి. ఇంతేగాక మొబైల్ సర్వీసులు అందించటానికి అవసరమయిన ఎక్విప్‌మెంటు సకాలములో కొననీయకుండా ప్రభుత్వము బిఎస్ఎన్ఎల్‌కు అనేక ఆటంకాలు సృష్టించి మొబైల్ సర్వీసుల వినియోగదారులలో అత్యధికులు ప్రయివేటు కంపెనీల వైపు వెళ్ళేలా చేసింది. బిఎస్ఎన్ఎల్‌కు వ్యతిరేకముగా ప్రభుత్వం అనుసరించిన ఇటువంటి విధానాల వలన 2009-10 నుండి బిఎస్ఎన్ఎల్ వరుసగా నష్టాలను ఎదుర్కొంటున్నది. ఖాయిలా పడే స్థితికి చేరుకుంటున్నది.

ఈ పరిస్థితిలో అవసరమయిన సహాయాన్ని అందించి బిఎస్ఎన్ఎల్‌ను పునరుద్ధారించాల్సిన బాధ్యత దాని యజమానిగా వున్న కేంద్ర ప్రభుత్వానికి వున్నది. కానీ ప్రభుత్వము ఈ పని చేయటం లేదు. బిఎస్ఎన్ఎల్‌ను మరింత దెబ్బతీసి ప్రయివేటు టెలికాం కంపెనీలను ప్రోత్సహించే విధముగా వ్యవహరిస్తున్నది. ఈ వ్యతిరేక వైఖరిని విరమించి బిఎస్ఎన్ఎల్‌ను కాపాడేందుకు ముందుకు రావల్సినదిగా బిఎస్ఎన్ఎల్ ఉద్యోగుల, అధికారుల సంఘాల ఐక్య వేదిక (ఫోరం) ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నది. బిఎస్ఎన్ఎల్‌ను కాపాడాలని కోరుతూ దేశవ్యాపితముగా కోటిమంది ప్రజల సంతకాలతో ఫిబ్రవరి 25న పార్లమెంటు వద్ద ప్రదర్శన జరిపి ప్రధానమంత్రికి మెమోరాండం సమర్పించాలని ఫోరం నిర్ణయించింది. ప్రధానమంత్రికి సమర్పించే ఈ మెమోరాండం పై మీరు సంతకం చేసి బిఎస్ఎన్ఎల్ పరిరక్షణకు మీ మద్దతు నివ్వాలని ఫోరం విజ్ఞప్తి చేస్తున్నది.

బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులుగా ప్రజలకు మెరుగయిన సేవలందించాలని మేము శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నాము. అయినప్పటికి ప్రభుత్వం మరియు మేనేజిమెంటు సకాలములో ఎక్విప్‌మెంటును, మెటీరియల్‌ను సప్లై చేయనందున ఇబ్బందులెదురవుతున్నాయి. ఈ ఇబ్బందిని పరిష్కరించేందుకు ప్రభుత్వము, మేనేజిమెంటు చొరవ తీసుకోవాలని మేము కోరుతున్నాము. వినియోగదారులకు మెరుగయిన సేవలందించేందుకు మేము నిరంతరం కట్టుబడి వుంటామని ఈ సందర్భముగా విన్నవిస్తున్నాము.

ప్రధానమంత్రికి సమర్పించే ఈ మెమోరాండం పై మీ సంతకంతో మీ సంస్థ అయిన బిఎస్ఎన్ఎల్ పరిరక్షణకు మీ తోడ్పాటు నందించాలని విజ్ఞప్తి చేస్తున్నాము.

అభినందనలతో

**బి ఎస్ ఎన్ ఎల్ ఉద్యోగుల/అధికారుల సంఘాల/**
**అసోసియేషన్ల ఐక్య వేదిక**

**................................జిల్లా**